క్లుప్తంగా

ఆర్థిక సహాయం అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన దాసరి దయానంద్‌కు గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది లింగం గౌడ్ బుధవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన దయానంద్ ఇటీవల అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. కార్యక్రమంలో గ్రామస్తులు బి. అనిల్, ఎన్ సత్యం, ఎన్ చిన్న గంగాధర్, ఎన్ రమేష్, డి చిన్న శ్రీనివాస్, చిన్ని, సందీప్, ఎం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాక్లూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రామవత్ సురేష్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ముల్లంగి (బి) గ్రామంలో ఇంటింటా బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. నాయకులు రమేష్, సాయిలు, విజయ్, రాకేష్, నరేష్, మధు, అరవింద్, రజినికాంత్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో బూత్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, జిల్లా నాయకుడు ముస్కు భూమేశ్వర్, మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిజ్ఞాన్ మాల్వియాను ఆర్మూర్ ఎంపీడీవో శివాజీ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజ గంగారాం, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేశ్, సుమ ఉన్నారు.

నేడు ఎడపల్లిలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బోధన్: ఎడపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సెక్షన్ ఆఫీస్ ఆవరణలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఏ.నారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎడపల్లి, బోధన్ రూరల్, రెంజల్ మండలాల వినియోగదారులు తమ ఫిర్యాదులను పరిష్కార వేదికలో అందించాలన్నారు.

‘పీఎం ఫసల్ బీమా’ వర్తింపజేయాలి



రుద్రూర్: రాష్ట్రంలోని రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తింపజేయాలని పోతంగల్ బీజేపీ మండల అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోతంగల్ రైతు వేదికలో వ్యవసాయాధికారి నిశితకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యాక్షుడు వెంకాగౌడ్, నాగనాథ్ పటేల్, కిరణ్ సేట్, ఓమన్న పటేల్, నయ్యూం, ఎల్లాబోయి, గంగన్న, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వేల్పూర్: విద్యార్థులు మత్తు పదార్థాలు, సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని మోర్తాడ్ ఎస్ఐ రాము సూచించారు. వేల్పూర్ మండలం రామన్నపేట ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం శివాజీ విద్యార్థులు పాల్గొన్నారు. వేల్పూర్‌మండలం కుకునూర్, వెంకటాపూర్ గ్రామాల్లో పోలీసు కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సంజీవ్ మాట్లాడారు.

పశు పోషకులకు అండగా..

- ఉపాధిహామీలో పశువుల షెడ్ల నిర్మాణం
- ఒక్కో షెడ్డుకు రూ.90 వేలు
- అవగాహన లేకపోవడంతో ముందుకు రాని పాడి రైతులు



పెర్కిట్‌లో రైతు సొంత డబ్బులతో నిర్మించుకున్న షెడ్డు



దేగాం గ్రామంలో షెడ్డు లేకపోవడంతో వర్షానికి తడుస్తున్న పశువులు

పెర్కిట్(ఆర్మూర్) : పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పశువుల షెడ్ల నిర్మాణానికి 2023లో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పశువులను ఎండ, వానల నుంచి కాపాడుకునేందుకు పాడి రైతులకు ఇది మంచి అవకాశం. రైతులకు అవగాహన లేకపోవడంతో షెడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. జాబ్ కార్డు కలిగిన పాడి రైతులు ఈషెడ్ల నిర్మాణం చేపట్టొచ్చు. ఆర్మూర్ మండలంలో సుమారు 25 నుంచి 30 పాడి పరిశ్రమలు ఉన్నాయి. కొంత మంది రైతులు సొంత సొంత ఖర్చులతో షెడ్లు వేసుకుని పాడి పరిశ్రమ నిర్వహిస్తుండగా మరి కొంత మంది ఎలాంటి షెడ్లు నిర్మించకుండా పాడి పరిశ్రమను కొనసాగిస్తున్నారు. అలాగే మండలంలో 150 మంది వరకు గొర్లు, మేకల పెంపకందారులు ఉంటారు. దీంతో పాటు కొంతమంది ఇంటి వద్ద పెరటి కోళ్ల పెంపకం చేపడుతున్నారు. పథకంపై సరైన అవగాహన లేకపోవడంతో పెంపకందారులు షెడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు.

బిల్లులు ఇలా...

రైతులు చేపట్టే పశువుల షెడ్ల నిర్మాణానికి లేబర్ కాంపోనెంట్, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.85 వేల నుంచి 90 వేలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. నిర్మాణంలో బేస్‌మెంట్, లెంటల్, రూఫ్ లెవల్ స్థాయిలు ఉంటాయి. వీటి ఆధారంగా రైతులకు బిల్లులను చెల్లిస్తారు. దశల వారీగా బిల్లుల చెల్లింపు ఉంటుంది. ఉపాధి హామీ పథకంలో సకాలంలో బిల్లులు రావనే అభిప్రాయంతో రైతులు నిర్మాణాలకు ముందుకు రావడం లేదు.

జాబ్ కార్డు, రేషన్ కార్డు ఉండాలి..

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి రేషన్ కార్డు ఉన్న గ్రామీణ ప్రాంత పాడి రైతులు పథకానికి అర్హులు. ఐదెకరాల కంటే తక్కువ ఉన్న చిన్న, సన్నకారు రైతులు మాత్రమే పథకం కింద షెడ్ల నిర్మాణం చేపట్టడానికి అవకాశం ఉంది. అలాగే పాడి పరిశ్రమలో మూడు కంటే ఎక్కువగా గేదెలు, ఆవులను కలిగి ఉండాలి. జీపీ కార్యదర్శి అనుమతి తీసుకుని పశు వైద్యాధికారి ధ్రువీకరణ పత్రంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు ఉపాధి హామీ కింద ద్వారా షెడ్ల నిర్మాణ పథకం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారికి షెడ్లను మంజూరు చేస్తాం. నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు వస్తాయి. పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సురేష్, ఏపీవో, ఆర్మూర్

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



ఆలూర్ తహసీల్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో..

సాక్షి, నెట్‌వర్క్ : తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు తెలంగాణ సాధనకు జయశంకర్ సార్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు.



బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో.. అధికారులు, ఉద్యోగులు



వేల్పూర్ మండల కేంద్రంలో..



బాల్కొండ మండల కేంద్రంలో ..



రుద్రూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో..



నందిపేట మండలం ఐలాపూర్ కళాశాలలో..

ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడుతాం



అధికారులతో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టి ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడుతామని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజక వర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రాజెక్ట్ వద్ద లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ వివరాలను తెలుసుకున్నారు. లక్ష్మికాలువ నుంచి వెంటనే నీటి విడుదల చేపట్టాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. స్పందించిన మంత్రి గురువారం నుంచి నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. రైతులు ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటిని వృథా చేయవద్దన్నారు. ఆయకట్టు రైతులు అధికారులతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఈఈ భానుప్రకాశ్, డిప్యూటీఈఈ సురేష్, రైతులు, సిబ్బంది తదితరులున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ మహిళలు ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో ముందంజలో ఉన్నారని సెర్ప్ ఏపీఎం ప్రమీల అన్నారు. మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. బుధవారం మండలంలోని సికింద్రాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు రూ.2 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఏపీఎం మాట్లాడారు. నాయకులు కన్నె సురేందర్, కుంట రమేష్, జీజే నర్సయ్య, భోజాగౌడ్, బంగ్ల దేవేందర్, జీవన్, బాల గంగాధర్, చిన్నారెడ్డి, నితీష్, జలం, బండారి గంగాధర్, సీసీలు కుంట శ్రీనివాస్, పురాస్తు నరేష్, వీవోఏ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు వేయించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్

నందిపేట్/డొంకేశ్వర్ (ఆర్మూర్): నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ నులి పురుగుల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు, ఏఎన్ఎంలకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వైద్యాధికారి శుభాకర్ నులిపురుగుల నిర్మూలన మాత్రలను (అల్బెండజోల్) 1–19 సంవత్సరాల పిల్లలకు తప్పక వేయించాలని సూచించారు. ఎంఈవోలు గంగాధర్, రామకృష్ణ, హెచ్ఎంలు సురేశ్‌కుమార్, లింగారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు సురేందర్, భాస్కర్, హేమలత, పలు పాఠశాల అధ్యాపకులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



కోటగిరిలో సూచనలు చేస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూర్: రెవెన్యూ సదస్సులో రైతులు నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. కోటగిరి తహసీల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి దరఖాస్తుల పురోగతి తెలుసుకున్నారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను మాడ్యూల్ వారీగా వర్గీకరించాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

‘భూభారతి’ రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

మాక్లూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ భూభారతి రికార్డులను పరిశీలించారు. రైతుల ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారనే వివరాలను, భూముల విక్రయాలకు సంబంధించి స్లాట్ల వివరాలను తహసీల్దార్ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ ఉన్నారు.

వరిలో కలుపు నివారణ చర్యలే కీలకం



దత్తాపూర్‌లో సలహాలు ఇస్తున్న ఏవో మధుసూదన్

డొంకేశ్వర్(ఆర్మూర్): వరి పైరులో కలుపు నివారణ చర్యలు తప్పకుండా చేపట్టాలని, లేదంటే 20–30శాతం దిగుబడి తగ్గిపోతుందని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ రైతులకు సూచించారు. కలుపు మొక్కలు వరి పైరుతో నీరు, వెలుతురు, పోషక పదార్థాలకు పోటీ పడుతాయని, ఈ దశ 20నుంచి40 రోజుల వరకు ఉంటుందన్నారు. నాట్లు వేసిన తర్వాత రెండు సార్లు కలుపు తీయాలన్నారు. లేదా పలు రసాయనాలు వాడినా వరిలో కలుపును నివారించవచ్చన్నారు.

- ప్రెటిలాక్లోర్ 0.5లీ లేదా బ్యూటాక్లోర్ 1.25లీ ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.
- 2–4 డీఈథైల్ ఎస్టర్ గుళికలు 8–10కిలోలు ఎకరానికి చల్లాలి.
- అనిలోఫాస్ 600 మి.లీ ఎకరానికి పై రసాయనిక మందులతో 2–4డి ఇథైల్ ఎస్టరుతో, బ్యూటాక్లోర్‌ని లేదా బెంధియోకార్బ్ కలిపి వాడితే ఎక్కువ కలుపు మొక్కలను నిర్మూలించవచ్చు.
- అక్సాడయార్జిల్ (35గ్రా. ఎకరానికి) మందును 1/2 లీ. నీటిలో కలిపిన ద్రావణాన్ని 20కిలోల పొడి ఇసుకలో కలిపి చల్లాలి.
- కలుపు మందు చల్లేటప్పుడు పొలంలో 2–5 సెం.మీ వరకు నీరు పెట్టాలి.
- బయటి నీరు లోపలికి, లోపలి నీరు బయటకు ఐదు రోజులు పోకుండా పొలం గట్లు సరిచేయాలి.
- కలుపు రసాయనిక మందులను పైరును బట్టి నిర్ణయించిన మోతాదును ఉపయోగించాలి.

విశ్రాంత ఉద్యోగుల సంఘ ఐక్యత ఆదర్శం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కమిటీ సభ్యులు



బోధన్‌లో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు ఎం. రాజేశ్వర్‌రావు

బోధన్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బోధన్ డివిజన్ శాఖ సభ్యుల ఐక్యత, పరస్పర సహకారం, అందిస్తున్న సేవలు ఆదర్శమని పీఆర్‌టీయూ ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి. రవికిరణ్ అన్నారు. 2025–28 వరకు మూడేళ్లకు గాను రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నూతన కమిటీ సభ్యుల పదవీ బాధ్యతల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, భోజాగౌడ్‌లు మాట్లాడారు.

నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ శాఖ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎం.రాజేశ్వర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మురహరి, ఉపాధ్యక్షులుగా మొవ్వ విజయలక్ష్మి, ఎం.డీ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శిగా వీ.సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా కుశాల్, ఫైనాన్స్ సెక్రెటరీగా దావులా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎం. పాపారావు,పబ్లిసిటీ సెక్రెటరీగా ముత్తన్న, గౌరవ అధ్యక్షుడిగా విఠల్‌రావు, డిస్ట్రిక్ కౌన్సిల్ సభ్యులుగా వెంకటేశం, వీరాగౌడ్‌లను ఎన్నుకున్నారు. బాధ్యతతో సేవలందిస్తామని నూతన కమిటీ సభ్యులు అన్నారు.ఎన్నికల ఆఫీసర్స్‌గా పి. ఆశయ్య, పి. భూమాగౌడ్, బీ. లింగయ్య, జీఎం శంకర్, గంగాధర్‌లు ఉన్నారు.ఎన్నికల ఆఫీసర్స్‌ను, నూతన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వివిధ మండలాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్ మండల మాదిగ కమిటీ ..



ఎన్నికైన సభ్యులు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల మాదిగ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. 12గ్రామాల మాదిగ కులస్తుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సుద్దపల్లి సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షులుగా సాయికుమార్, కోశాధికారిగా మహేశ్, ప్రధానకార్యదర్శిగా సంజీవ్, సంయుక్త కార్యదర్శిగా కత్తుల అనిల్, సభ్యులుగా మల్లేష్, గంగారాం. నిఖిల్, రాజన్న, సాయికుమార్, బద్రి, మల్లేష్, సుధాకర్ ఎన్నికయ్యారు. మాదిగల సమస్యలపై పోరాడుతామని నూతన కార్యవర్గం ప్రమాణం చేసింది.

బీఆర్ఎస్‌వీ కార్యవర్గం ఎంపిక



నియామకపత్రం అందిస్తున్న దొన్కంటి నర్సయ్య

మోర్తాడ్: భీమ్‌గల్ మండల భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం(బీఆర్ఎస్‌వీ) కార్యవర్గాన్ని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సూచన మేరకు బుధవారంఎంపిక చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య తెలిపారు. అధ్యక్షుడిగా తోట నితిన్, ఉపాధ్యక్షులుగా అడుప శ్రీజిత్, బొదిరె నిహాల్, ప్రధాన కార్యదర్శిగా ఓరగంటి విఘ్నేష్, కార్యదర్శులుగా బర్ల అభిలాష్, జెట్టి సృజన్, సంయుక్త కార్యదర్శిగా పాలెపు వినయ్, కోశాధికారిగా కర్నె నిశాంత్, కార్యవర్గ సభ్యులుగా అవినాష్, నిహాల్, నిషాంత్, రాహుల్, అనిరుధ్‌లను ఎంపిక చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న మస్తాన్ అలీ

రుద్రూర్: మండల కేంద్రంలోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో, కోటగిరి మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు విద్యార్థులకు బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైబర్ క్రైం అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్సైలు సాయన్న, సునీల్ కళాశాల ఇన్‌చార్జి పి.శ్రీలత, ప్రోగ్రాం ఇన్‌చార్జి శివకుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పరిధి లో పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ బుధవారం తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఫోన్లను శ్రీకాంత్, శంకర్, అశోక్, సూర్యమణిలకు అందజేశారు.

గోదాములను పరిశీలించిన డీఏవో



నీలా గోదాము వద్ద స్టాక్ బోర్డును పరిశీలిస్తున్న డీఏవో గోవింద్

రెంజల్(బోధన్): మండలంలోని నీలా సహకార సంఘం, రెంజల్ సహకార సంఘం పరిధిలోని సాటాపూర్ గోదాములను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి గోవిందు తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. పీవోఎస్ మిషన్ గ్రౌండ్ బ్యాలెన్స్ సరిగా ఉన్నాయా లేవా అని తనిఖీ నిర్వహించారని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సిద్ది రామేశ్వర్ తెలిపారు. గోదాముల వద్ద ధరల బోర్డు ఏర్పాటు చేయాలని సీఈవోలకు సూచించారు.

పోచారం గ్రామ శివారులోని కోళ్ల ఫారం..

బోధన్ : ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ శివారులో గల కోళ్ల ఫారంను బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం. గోవింద్, ఏవో సిద్ది రామేశ్వర్‌తో కలిసి సందర్శించి తనిఖీ చేశారు. కోళ్ల ఫారం లోపల కలియ తిరిగి అక్కడ నిల్వ ఉన్న దాణా సంచులను పరిశీలించారు. సబ్సిడీపై అందిస్తున్న యూరియా ఎరువును కోళ్ల ఫారంలో వాడుతున్నారా అనే విషయంపై ఆరా తీసేందుకు తనిఖీ చేసినట్టు తెలుస్తోంది.

ముర్రుపాలు పట్టించాలి



బోధన్‌లో మాట్లాడుతున్న సీడీపీవో పద్మ

బోధన్: తల్లి పాల ప్రాధాన్యతపై గర్భిణులకు అవగాహన కల్పించాలని బోధన్ సీడీపీవో పద్మ అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి సూచించారు. రాకాసీపేట ప్రాంతంలో గల లయన్స్ కంటి ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణిలు,బాలింతలతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్పునంతరం మొదటి గంటలో బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్టాస్ట్ గవర్నర్ పోలవరపు బసవేశ్వర్‌రావు, డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సమతా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమేనని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాహంస అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల్లో రాత్రి వేళ ఇసుక డంప్‌లు వేసి తరలిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమగు ఇసుక రవాణాకు అధికారులు అవసరమైన వేబిల్లులు అందిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తూ అక్రమార్కులు లక్షలు అర్జిస్తున్నారు. రుద్రూర్ మండలంలోని రాయకూర్ , సులేమాన్‌నగర్ శివారులో ఇసుక డంప్‌లు ఉన్నాయనే సమాచారం మేరకు మంగళవారం రాత్రి తహసీల్దార్ తారాబాయి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాయకూర్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని మండల సమీకృత కార్యాలయం వద్దకు తరలించారు. అనంతరం సులేమాన్ శివారులో తనిఖీ చేస్తుండగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టుబడింది. ఈ టిప్పర్‌ను రుద్రూర్ పోలీస్‌స్టేషన్ తరలించారు.